ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.5
కనిష్ఠం 24.6
**
ANDHRAJYOTHY
సూర్యాపేట
3
బుధవారం 18 సెప్టెంబరు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.90 (311.7462)	67,871	70,629
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644 (4.20)	382.28	629.46
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.17 (44.4)	51,030	51,030

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.160 | స్కిన్‌లెస్ : రూ.190



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

అమరుల త్యాగాల ఫలం

నేటి అభివృద్ధి

- బాలెంల పోరాటం చరిత్రాత్మకం
- నాటి పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయాలి
- రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 17 : పోరాటాలకు పురిటిగడ్డ ఉమ్మడి నల్లగొండ జిల్లా అని, నాటి అమరుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అభివృద్ధికి నాంది అని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భవించడానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాటయోధులకు, స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరూ జోహాలర్పించాలన్నారు. సెప్టెంబరు 17 తెలంగాణ ప్రజలకు కీలకమైన రోజన్నారు. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యం ఎంతో మంది ప్రాణత్యాగాల ఫలితమన్నారు. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటుంటే హైదరాబాద్ సంస్థానం ప్రజలు మాత్రం స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే ఉన్నారన్నారు. 1920 వరకు నిజాం రాజ్యంలో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు లేవన్నారు. నిజాం రాజ్యం స్వతంత్రంగా ఉంటుందని నిజాం రాజు ప్రకటించారు. కానీ సంస్థానంలోని భూస్వాములు, జమీందార్లు, జాగిర్దార్లు, దేశ్‌ముఖ్‌లు ప్రజలను వేధించడంతో పాటు రైతుల చేతికి వచ్చిన పంటలను దోచుకోవడం, స్థానిక భాషను అణిచివేయడం, వెట్టి చాకిరి, బానిసత్వంతో రజాకార్ల దమనకాండ కొనసాగిందని వివరించారు. నిజాం రాజ్యంలో కనీస హక్కుల కోసం పోరాడిన వారిపై, ఎదురించిన వారిపై దాడులు ఎక్కువ కావడంతో ప్రజలు ఎదురుతిరిగారని అన్నారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు కావడానికి ముఖ్య కారణం గ్రంథాలయ ఉద్యమన్నారు. 1901లో మొదటి గ్రంథాలయం శ్రీకృష్ణాభాష నిలయాన్ని మునగాల రాజానాయనివెంకటరంగారావు స్థాపించారని గుర్తుచేశారు. 1904లో లక్ష్మణరావు కృషితో హన్మకొండలో నరేంద్ర భాష నిలయాన్ని స్థాపించారని, 1933 నుంచి 1946 వరకు జరిగిన 13 ఆంధ్ర మహాసభలు తెలంగాణ ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించినట్లు స్పష్టం చేశారు. ఆనాడు జరిగిన ప్రజా పోరాటంలో నల్లగొండ ప్రజల పోరాట పటిమ కీలకమైందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బీంరెడ్డి నర్సింహారెడ్డి, ధర్మభిక్షం, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యంతో పాటు మరికొందరు తెలంగాణ త్యాగధనులు తెలంగాణ ఉద్యమాన్ని ప్రభావితం చేశారని కొనియాడారు. రాచరిక వ్యవస్థపై జరిగిన పోరాటంలో మొదటిసారి అశువులుబాసిన దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ఉద్యమం తీవ్రమైందన్నారు. ప్రజల చెంతకే ప్రభుత్వ యంత్రాంగం వెళ్లి ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లాలో మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల అమలుకోసం 3,76,419 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితం ప్రయాణం కల్పిస్తున్నామని ఇప్పటి వరకు రాష్ట్రంలో 87.12కోట్ల ఉచిత ప్రయాణాలు జరిగాయని దీంతో మహిళలకు రూ.2,958 కోట్లను ఆదా చేయగలిగారన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2.36 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. దీంతో రూ.67.52కోట్లు మహిళలు లబ్ధిపొందినట్లు వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గతంలో రూ.ఐదు లక్షల వరకు మాత్రమే ఉచితం వైద్య సేవలందించేవారని దానిని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. రూ.500 వంటగ్యాస్ సిలిండర్ పథకం ద్వారా జిల్లాలో 1.48లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. దీనికిగాను ప్రభుత్వం రూ.8.24కోట్లను సబ్సిడీ కింద ఆయా గ్యాస్ కంపెనీలకు అందిస్తోందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా జిల్లాలో 1,66,326 మంది లబ్ధిపొందుతున్నారని, ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.28.42కోట్లను సబ్సిడీ కింద అందచేసిందన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ పథకంలో భాగంగా జిల్లాలో 1,00,545 మంది రైతుల ఖాతాలో రూ.838.69 కోట్లను జమ చేశారన్నారు. స్వాతంత్ర సమర యోధులు ఏమైనా సమస్యలు ఎదర్కొంటుంటే వాటిని కలెక్టర్ వెంటనే పరిష్కరించాలని సూచించారు.



జాతీయ జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న గోపిశెట్టి నిరంజన్, కలెక్టర్, ఎస్పీ

స్టాల్స్ సందర్శన



తెలంగాణ ప్రజాపాలన వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో వివిధశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా పీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్‌లో డీఎస్‌ఆర్ ప్రాజెక్టు గురించి వివరించారు. డైరెక్టు సీడెడ్ రైస్ పద్ధతినని వివరించారు. అదేవిధంగా జిల్లా సమాచార ప్రజా సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధికి సంబంధించిన ఫొటోగ్యాలరీని ఏర్పాటుచేశారు. వీటితో పాటు పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, అదనపు ఎస్పీలు మేక నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, ఆర్డీవో వేణుమాధవ్, డీఎస్పీ జీ రవి, వివిధ శాఖల అధికారులు అప్పారావు, సతీష్‌కుమార్, శంకర్, అశోక్, జగదీష్‌రెడ్డి, నారాయణరెడ్డి, అనసూయ, నర్సింహారావు, కిషన్, శ్రీధర్‌రెడ్డి, లత, రామచంద్రరావు, సుదర్శన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. ముందుగా పోలీసుల నుంచి నిరంజన్ గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాలాపనతో పాటు తెలంగాణ రాష్ట్ర గీతాలాపన చేశారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు.



సమర యోధులను సన్మానిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

ప్రజాపాలన వేడుకల్లో జిల్లాకు చెందిన పలువురు స్వాతంత్ర్య సమరయోధులను తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ సన్మానించారు. జిల్లాకు చెందిన గుంటకండ్ల రాంచంద్రారెడ్డి, బండ పుల్లారెడ్డి, అబ్బగాని భిక్షం, గుడిపాటి అంజయ్య, బ్రహ్మదేవర వెంకన్నలను సన్మానించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాపాలన వేడుకల్లో పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దీంతో పాటు జడ్పీహెచ్ఎస్ చివ్వెంల విద్యార్థులు పలువురు జాతీయ నాయకుల వేషధారణలు పోషించి చేసిన ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. వీరితో పాటు శ్లోక పాఠశాల సూర్యాపేట, జడ్పీహెచ్ఎస్ చివ్వెంల, జవహర్ బాలభవన్ సూర్యాపేట, శ్రీచైతన్య పాఠశాల సూర్యాపేట విద్యార్థులునృత్యాలు చేశారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



ఎస్పీ క్యాంపు కార్యాలయంలో

సూర్యాపేటక్రైం: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, డీఎస్పీ జీ రవి, ఎస్‌బీఐ వీరరాఘవులు, సీఐలు రాజశేఖర్, సురేందర్ రెడ్డి, ఆర్ఎస్ఐ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



తుంగతుర్తిలోని పశువైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

తుంగతుర్తి, సెప్టెంబరు 17 : నేటి నుంచి డిసెంబరు 31 వరకు పశువులకు ఉచితంగా జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం ద్వారా సేవలు అందిస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి డీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలను ఆయన సందర్శించి, మాట్లాడారు. నేటి నుంచి జిల్లావ్యాప్తంగా 54వేల పశువులకు కృత్రిమ గర్భధారణ సేవలు అందిస్తామన్నారు. ఇందుకోసం సుమారు రూ.55 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ కృత్రిమ గర్భధారణ పథకం అమలు కోసం ఒక ప్రత్యేక యాప్ రూపొందించారని, పశువుల వివరాలన్నీ ఈ యాప్‌లో పొందుపరుస్తామన్నారు. దీనికి గాను ప్రతీ రైతు ఆధార్‌కార్డు నెంబరు యాప్‌లో పొందుపర్చాలన్నారు. అంతేకాకుండా ప్రతీ పశువుకు కృత్రిమ గర్భధారణ చేసిన తర్వాత చెవిపోగు వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వెటర్నరీ వైద్యులు వెంకన్న, రవిప్రసాద్, సిబ్బంది మహేందర్, బుచ్చిబాబు, గణేష్, విజయ్, ఉపేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వంట నూనెల ధరల మంట

- దిగుమతి సుంకం పెంపుతో ధరలకు రెక్కలు
- ఒక్కో ప్యాకెట్‌పై రూ.15 నుంచి రూ.20 పెంపు
- పండుగల వేళ ప్రజలపై పెనుభారం

పండుగల వేళ సామాన్యుడి నెత్తిన మరో పిడుగు పడినట్లయింది. వంట నూనెల ధరలు కాకపుట్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచడంతో మార్కెట్లో నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. ఒక్కో నూన ప్యాకెట్‌పై రూ.15 నుంచి రూ.20 వరకు పెంచి విక్రయిస్తున్నారు. కాగా, రోజు రోజుకూ నూనెల దందా జోరుగా సాగుతుండటంతో ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంలా మారుతోంది.
- భూదాన్‌పోచంపల్లి

కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని (ఇంపోర్ట్ డ్యూటీ) పెంచుతున్నట్టు ప్రకటించడంతో మార్కెట్లో ఒక్కసారిగా ధరలు పెరిగాయి. అన్ని రకాల నూనెల ధరలు లీటర్‌పై ఒక్కసారిగా రూ.15నుంచి రూ.20వరకు పెరిగాయి. పామాయిల్ రూ.100 నుంచి రూ.115, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115నుంచి రూ.130-140,వేరుశనగ నూనె రూ.155నుంచి రూ.165కు చేరింది. రూ.170 ఉన్న మంచి పల్లీ నూనె రూ.220 వరకు పెరిగింది. పూజలకు ఉపయోగించే నూనెలనూ రూ.110 నుంచి రూ.120కి పెంచి వ్యాపారులు విక్రయిస్తున్నారు. పండుగలు మొదలైన తరుణంలో నూనె ధరలు పెంచడంపై వినియోగదారులు భగ్గుమంటున్నారు.

జోరుగా కల్తీ నూనెల దందా

మార్కెట్లో కల్తీ నూనెల దందా జోరుగా సాగుతోంది. వేరుశనగ గింజలు కొని గానుగాడిస్తే లీటర్ పల్లీనూనె ధర రూ.300పై చిలుకు పడుతోంది. కానీ, మార్కెట్లో వేరుశనగ నూనె పేరుతో రూ.210కే విక్రయిస్తున్నారు. అంటే దానిలో కల్తీ ఉన్నట్టేనని వినియోగదారులు పేర్కొంటున్నారు. పొద్దు తిరుగుడు నూనె విషయంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇక రూ.100కు లీటర్ చొప్పున విక్రయిస్తున్న నూనెలు దేని నుంచి తయారవుతున్నాయో తెలియదని వినియోగదారులు వాపోతున్నారు. ఇష్టమొచ్చిన కల్తీ నూనెలు వాడకం వల్ల పలు అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూనె గింజల సాగు నానాటికీ తగ్గిపోతోంది. వాటికి మద్దతు ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి పౌరసరఫరాలశాఖ, రేషన్ దుకాణాల ద్వారా వంట నూనెలు సరసమైన ధరలకు పంపిణీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఏం కొనేట్టు లేదు



వంట నూనె ధరలు అకస్మాత్తుగా పెంచేశారు. పండుగ పూట పిండి వంటలు చేసుకునే వేళ ఇలా ధరలు పెంచడం తగదు. ఒకేసారి లీటర్ నూనెకు రూ.20 పెంచడం దారుణం. కేంద్ర ప్రభుత్వం నూనెలపై పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి.
- యాదమ్మ, గృహిణి, భూదాన్‌పోచంపల్లి

కరక్కాయలగూడెం గండి పూడ్చివేత

- భారీ వర్షాలకు సాగర్ ఎడమకాల్వ బ్రాంచ్‌కెనాల్‌కు గండి
- నాలుగు రోజుల కిందట మంత్రి ఉత్తమ్ పరిశీలన
- రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశం
- నేటి నుంచి బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదల



హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం వద్ద కొనసాగుతున్న గండిపూడ్చివేత పనులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 17: మండలంలోని నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు పడిన గండిని అధికారులు పూడ్చివేయించారు. ఈ నెల 4వ తేదీన ఎడమకాల్వ మొదటిజోన్ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం సమీపంలో 14.63వ కిలోమీటర్ వద్ద గండి పడిన ప్రదేశాన్ని నాలుగు రోజుల కిందట మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. రెండు రోజుల్లో గండిని పూడ్చి నీటిని విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆ మేరకు అధికారులు సోమ, మంగళవారాల్లో పనులు చేపట్టి గండిని పూడ్చివేయించారు. భారీ స్థాయిలో పడిన గండిని పూడ్చే బాధ్యతలను ప్రముఖ నిర్మాణ సంస్థకు కాంట్రాకు అప్పగించగా యూటీ కింద వాల్ కూడా నిర్మించి కాల్వకు పడిన గండిని పూడ్చివేశారు.

గండి పూడ్చిన నేపథ్యంలో బుధవారం నుంచి ఎంబీ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. అదేవిధంగా 22వ కిలోమీటర్ వద్ద ఎడమకాల్వ కోతకు గురైన ప్రదేశంలోనూ మరమ్మతులు పూర్తి చేశారు. ఇదిలా ఉండగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు గండి పూడ్చివేతతో పాటు కాల్వ మరమ్మతు పనులను టీపీసీసీ బృందం, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పనులు పర్యవేక్షించారు. గండి పూడ్చేందుకు నిధులు మంజూరు చేసిన మంత్రి ఉత్తమ్‌కు కాంగ్రెస్ నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంబీ కెనాల్ పరిధిలో సుమారు లక్షా 7వేల ఎకరాల ఆయకట్టు ఉండగా 15 రోజుల నుంచి నీరు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మట్టపల్లి, రామాపురం, గణపవరం, కందిబండ, చింతిర్యాల మేజర్ల పరిధిలో పొలాలు ఎండిపోగా బుధవారం నీటి విడుదల నేపథ్యంలో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తి



మోతె మండల ఉర్లుగొండ సబ్‌స్టేషన్‌లో చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న సీజీఎం భిక్షపతి, ఎస్ఈ ఫ్లాంకెన్

మోతె, సెప్టెంబరు 17 : ఇటీవలి వరదల్లో కొట్టుకుపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, నేలకొరిగిన స్తంభాల పునరుద్ధరణ పనులు రెండు రోజుల్లో పూర్తి కానున్నట్లు మహబూబ్‌నగర్, నల్లగొండ, యాదాద్రి విద్యుత్ రెండో జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ భిక్షపతి అన్నారు. పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మండలంలో నెలకొన్న విద్యుత్ సంబంధిత సమస్యలపై రెండు రోజులుగా ఎస్ఈ ఫ్లాంకెన్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఆయన మంగళవారం పరిశీలించి, మాట్లాడారు. ఉర్లుగొండ సబ్‌స్టేషన్‌లో పనులను పరిశీలించారు. జోన్‌లో వరదలతో ఇంత నష్టం ఎన్నడూ చూడలేదని, మోతె మండలంలో ఎక్కువగా పాలేరు పరివాహక ప్రాంతం ఉండటంతో ఆయా గ్రామాల్లో వాగు అలుగులు పోసి విద్యుత్ స్తంభాలు, ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు వరదలో కొట్టుకుపోయాయన్నారు. మరికొన్ని వరదలో మునిగిపోవడంతో సిబ్బంది బయటకు తీయలేకపోతున్నారని వివరించారు. మండలంలో మొత్తం 40 ట్రాన్స్‌ఫార్మర్లు, 50 విద్యుత్ స్తంభాలు వరదలో కొట్టుకుపోయినట్లు గుర్తించామన్నారు. రెండు రోజులుగా పూర్తిస్థాయిలో సిబ్బందితో కలిసి తుమ్మగూడెంలో 16 నూతన స్తంభాల ఏర్పాటుతో పాటు 11 కేవీ విద్యుత్ తీగలను నేరేడువాయి మీదుగా తుమ్మగూడెం వరకు ఏర్పాటు చేశామన్నారు. నర్సింహాపురంలో 100 కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పాటు కూడలిలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. పాలేరు ఏరుకు ఆనుకుని ఉన్న అన్నారిగూడెం, ఉర్లుగొండ, తుమ్మగూడెం, నేరేడువాయి, నర్సింహాపురం గ్రామాల మధ్యలోని 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు, స్తంభాలు వరదలో మునిగి దొరకడం లేదని వాటి స్థానంలో నూతనంగా ఏర్పాటు చేయడంలో కొంత ఆలస్యం అయ్యిందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ సమస్యలు ఉన్న రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఫ్లాంకెన్, సూర్యాపేట, హుజూర్‌నగర్ డీఈలు దాలీనాయుడు, నిమ్మ వెంకటక్రిష్ణ, ఏడీఈ వినోద్, ఏఈ శాంతి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

చార్లెట్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 17: చార్లెట్స్ ఫౌండేషన్ సేవలు ఎంతో అభినందనీయమని అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు అన్నారు. ఇటీవల ఖమ్మంలో వరదలతో ముంపునకు గురైన బాధితులకు చార్లెట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చుతున్న నిత్యావసరాల వాహనాన్ని ప్రారంభించి, మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు సమాజసేవకు పాటుపడాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వానికి తోడుగా సాయం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో చివ్వెంల ఎస్ఐ వెంకటరెడ్డి, ఫౌండేషన్ నిర్వాహకుడు జాటోత్ రాజు ఉన్నారు.

తెలంగాణ తల్లిని అవమానించిన ప్రభుత్వం



తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ లింగయ్యయాదవ్


సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 17 : తెలంగాణ సచివాలయం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటుచేసి తెలంగాణ తల్లిని అవమానించారని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణతల్లి విగ్రహానికి పార్టీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పేరు ఎత్తితే తుపాలకుతో కాల్చుతామన్న వారే నేడు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటుచేశారని దుయ్యబట్టారు. తెలంగాణ పేరు ఉచ్ఛరించలేని సీఎం రేవంత్‌రెడ్డిని గెలిపించడం ప్రజలు చేసుకున్న దురదుష్టమన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్నివర్గాల ఆమోదంతో మాజీ సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు అమలుకానీ హామీలు ఇచ్చి ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన కాంగ్రెస్ నాయకులు నేడు హామీలను అమలు చేయలేకపోతున్నారని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా సచివాలయం, అమరజ్యోతి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆ ప్రాంతాన్ని పెద్ద కూడలిగా మాజీ సీఎం కేసీఆర్ మార్చారని వివరించారు.

ఆ కూడలిలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ఆలోచన చేశారని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఆ స్థలంలో రాజీవ్‌గాంధి విగ్రహాన్ని ఏర్పాటుచేసి తెలంగాణ సమాజాన్ని అవమానించారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి దుర్మార్గపు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, పుట్టా కిశోర్‌కుమార్, జీడి భిక్షం, నెమ్మాది భిక్షం, మొరిశెట్టి శ్రీనివాసులు, సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులుగౌడ్, తూడి నర్సింహారావు, మర్ల చంద్రారెడ్డి, ఆకుల లవకుశ, కక్లెట్లపల్లి శోభన్‌బాబు, మద్ది శ్రీను, సుంకరి రమేష్, గండూరి కృపాకర్, ఉపేందర్, ఎండీ సాల్మా, వల్దాస్ జానీ, రియాజ్, సయ్యద్, బత్తుల ప్రసాద్, కిషన్‌నాయక్, నయీం, శేఖర్‌రెడ్డి, విజయ్, రాంమూర్తి, రేణుబాబు, రాంబాబు, సుదర్శన్, నవీన్, కరుణశ్రీ, పూర్ణశశికాంత్ తదితరులు పాల్గొన్నారు.









అగ్ని ప్రమాదంలో రూ.3లక్షల ఆస్తి నష్టం

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబర్ 17: విద్యుదాఘాతంతో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇరిగి మరియమ్మ తన భర్త కాశయ్య చనిపోవడంతో పదేళ్లుగా మూడు గేదెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో తనకున్న గేదెలను మేపడానికి సమీపంలోని పొలాల వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో సాయంత్రం సుమారు 5గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లోని సామగ్రి అంతా దగ్ధమైంది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పి వేశారు. ఆర్ఐ లక్ష్మీకాంత్, పంచాయతీ కార్యదర్శి బుర్రి శ్రీనివాస్‌లు పంచనామా నిర్వహించారు. సుమారు రూ.3లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంది.



క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

● యాదగిరీశుడి సన్నిధిలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 17: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేశారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం శైవగామ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.23,25,994 ఆదాయం రాగా లీజుల ద్వారా రూ.2,78,947 సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, కొండపైన జాతీయ జెండా ఆవిష్కరణ డీఈవో దోర్బల భాస్కర్‌శర్మతో కలిసి ఆలయ ఈవో ఏపూరి భాస్కర్‌రావు చేశారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రత్యేకపూజలు చేశారు.

నల్లగొండ - భువనగిరి మధ్య సెమీ డీలక్స్ బస్సులు

నల్లగొండ, సెప్టెంబరు 17: ప్రయాణికుల సౌకర్యార్థం నల్లగొండ-భువనగిరి మధ్య సెమీ డీలక్స్ బస్సులను ప్రారంభించినట్లు రీజనల్ మేనేజర్ ఎం.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ నుంచి చిట్యాల, వలిగొండ మీదుగా భువనగిరికి ఈ సెమీ డీలక్స్ బస్సులు నడుస్తాయన్నారు. నల్లగొండ నుంచి భువనగిరి వరకు ఎక్స్‌ప్రెస్ చార్జి రూ.100, సెమీ డీలక్స్ బస్సుల్లో రూ.110 చార్జీలు ఉంటాయన్నారు. సెమీ డీలక్స్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తించదని తెలిపారు.













జీ.ఎడవల్లి కొత్త చెరువుకు గండ్లు

● చెరువు నీరు వృథా... గండ్లు పూడ్చాలంటున్న రైతులు

కనగల్, సెప్టెంబరు 17: నల్లగొండ జిల్లా కనగల్ మండంలోని జీఎడవల్లి గ్రామ కొత్తచెరువు అలుగుకు పలుచోట్ల గండ్లుపడ్డాయి. దీంతో చెరువులోని నీరంతా దిగువకు వృథాగా పోతోంది. చెరువుకు గతేడాది ఇదే చోట గండ్లుపడగా రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి గండ్లను పూడ్చి వేశారు. అయితే అలుగు కట్ట బలహీనంగా ఉండటంతో అక్కడే మళ్లీ గండ్లు ఏర్పడ్డాయని రైతులు వాపోయారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి గండ్లను తక్షణమే పూడ్చివేసి నీటి వృథాను అడ్డుకోవాలని కోరుతున్నారు. చెరువు విస్తీర్ణం సుమారు 400 ఎకరాలుండగా, అదేస్థాయిలో ఆయకట్టు విస్తీర్ణం ఉందని రైతులు వివరించారు.


చెరువుకు గండి పడిన ప్రాంతం

అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడలో ప్రతిభ

● అంతర్జాతీయ 24వ స్థానంలో నిలిచిన బంగారిగడ్డవాసి

చండూరు రూరల్, సెప్టెంబరు 17: నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామానికి చెందిన షేక్ ఫౌజియా అంతర్జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ 24వ స్థానంలో నిలిచింది. ఈ నెల 14, 15 తేదీల్లో న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన పోటీల్లో భారతదేశం తరఫున తలపడి 24వ స్థానంలో నిలిచింది. ఫోయిల్ ఉమెన్స్ సాటిలైట్ టోర్నీలో పాల్గొన్న ఫౌజియా ప్రస్తుతం వరంగల్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా శిక్షణ పొందుతున్నారు. తనకు ఇంతటి సహాయ సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



షేక్ ఫౌజియా

యర్రవరం పీఏసీఎస్ కార్యదర్శి సస్పెండ్

కోదాడ రూరల్, సెప్టెంబర్ 17: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం యర్రవరం సింగిల్ విండో సహకార పరపతి సంఘం కార్యదర్శి హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ పాముల వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ మంగళవారం సంఘం తీర్మానించింది. ఇందుకు సంబంధించిన తీర్మాణ కాపీని జిల్లా సహకార అధికారికి పంపినట్లు చైర్మన్ నలజాల శ్రీనివాస్ తెలిపారు. ఆయన అధ్యక్షతన జరిగిన సహకార పరపతి సంఘ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ రుణమాఫీని రైతులకువర్తింపజేయడంలో సంఘ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్లు నిర్లక్ష్యం వహించినందుకు సంఘంలో 66 మంది రైతులకు రూ.30లక్షల రుణమాఫీ వర్తించకుండా పోయిందన్నారు. ఈ విషయంపై రైతులు సంఘం చైర్మన్, జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా సహకార అధికారి విచారణకు ఆదేశించారన్నారు. విచారణ జరిపిన అధికారులు సంఘం కార్యదర్శి హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేశ్వర్లు రుణమాఫీకోసం రైతుల జాబితాను ప్రభుత్వానికి, జిల్లా బ్యాంక్‌కు పంపడంలో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించారు. ఇందుకు బాధ్యులైన ఇరువురిపై చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార అధికారి చైర్మన్‌ను ఆదేశించడంతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యదర్శి హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేశ్వర్లును సస్పెండ్‌చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో చైర్మన్ నలజాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సుభాష్‌రెడ్డి, డైరెక్టర్లు గుగులోతు రవి, సైదా, మంగమ్మ, అన్నెం రవీందర్‌రెడ్డి, పల్లపు సుదర్శన్, మండాది శ్రీను పాల్గొన్నారు.

సాగర్‌కు కొనసాగుతున్న వరద

● రెండు గేట్ల ద్వారా నీటి విడుదల ● పూర్తిస్థాయి నీటిమట్టానికి మూసీ జలాశయం ● పులిచింతల నుంచి దిగువకు కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు17: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక కొనసాగుతుండటంతో రెండు క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 67,871 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 589.90 అడుగులుగా(311.7462టీఎంసీలు) నమోదైంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ, కుడి, ఎడమకాల్వలకు, 2గేట్ల నుంచి మొత్తం 70,629 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన మొత్తం 11గేట్లు మూసివేయగా, 12వ తేదీన 10గేట్లు ఎత్తి అదే రోజు రాత్రి అన్నీ గేట్లు మూసేశారు. 13వ తేదీన 2గేట్లు ఎత్తగా, 14న మరో 2గేట్లు ఎత్తి మొత్తం 4 నాలుగు గేట్ల నుంచి నీటి విడుదల చేశారు. ఆదివారం నాలుగు గేట్ల నుంచి నీటి విడుదలను కొనసాగించగా, సోమవారం రెండు గేట్లు మూసివేసి రెండు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం రెండు గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగించారు.


సాగర్ ప్రాజెక్ట్ నుంచి రెండు గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

మూసీకి 382.28క్యూసెక్కుల వరద

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో ఉన్న మూసీ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 645అడుగులు(4.46టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 644అడుగులుగా(4.20టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి 382.28క్యూసెక్కుల వరద వస్తుండగా, కాల్వలకు 629.46క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రెండు గేట్ల ద్వారా పులిచింతల నీరు..

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతుండగా.. రెండు గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, మంగళవారం సాయంత్రానికి 174.17 అడుగులుగా(44.4 టీఎంసీలు) నమోదైంది. ఎగువ నుంచి 51,030 క్యూసెక్కుల వరద వస్తుండగా, రెండు గేట్ల నుంచి 35,030 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కులు మొత్తంగా 51,030 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన మొత్తం 24గేట్లను మూసివేగా, 12న మూడు గేట్లను ఎత్తారు. 13న రెండు గేట్లు మూసి ఒక గేటు నుంచి నీటి విడుదల చేశారు. 14వ తేదీన మరో రెండు గేట్లు ఎత్తి మూడు గేట్ల నుంచి, ఆదివారం ఒక గేటు మూసి రెండు గేట్ల నుంచి విడుదల చేశారు. సోమవారం రెండు గేట్ల నుంచి నీటి విడుదల చేయగా, మంగళవారం దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది.

ఎమ్మెల్యే సంజయ్‌గైక్వాడ్‌పై చర్యలు తీసుకోవాలి

● రాహుల్‌గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు సరికాదు ● భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో సంజయ్ గైక్వాడ్‌పై ఫిర్యాదు చేస్తున్న కిరణ్ కుమార్‌రెడ్డి, వీహెచ్

శాలిగౌరారం, సెప్టెంబరు 17: శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఆయన నల్లగొండ జిల్లా శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై మహారాష్ట్ర సీఎం షిండే వర్గానికి చెందిన సంజయ్ గైక్వాడ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా ఉన్నందున అతనిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నాలుక కోసిన వారికి రూ.11లక్షలు బహుమతి ఇస్తానని ప్రకటించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ ద్వేషపూరిత వ్యాఖ్యలు సమాజంలో దుష్ప్రవర్తనను ప్రోత్సహించే విధంగా ఉన్నాయన్నారు. ఈ వ్యాఖ్యలు రాహుల్ గాంధీని చంపేందుకు కాంట్రాక్ట్(సుపారీ) ఇవ్వడం తప్ప మరొకటి కాదన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే ఈ వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని శాలిగౌరారం సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ డి.సైదులుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం కూడా ఫిర్యాదులో సంతకాలు చేశారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 17: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో ఒక కుటుంబానికి చెందిన ముగ్గురిపై దాడి కేసు నమోదైంది. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఉప్పతల అయోధ్య, సాతునూరి మాధవరావు, ఒకే వీధిలో ఎదురెదురుగా ఉంటున్నారు. ఈ రెండు కుటుంబాల మధ్య మురుగుకాల్వ విషయంలో గతంలో అనేక గొడవలు జరిగాయి. కాగా మంగళవారం ఉదయం అయోధ్య అతని భార్య వారి ఇంటి ఆవరణలో ఉండగా.. సాతునూరి సురేష్ వారిని ఫొటోలు తీశారని, అదేమిటని అడగగా సాతునూరి సురేష్, సాతునూరి మాధవరావు సాతునూరి లక్ష్మీలు అయోధ్య, అయోధ్య భార్యపై దాడి చేశారని అయోధ్య భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అరెస్ట్

దేవరకొండ, సెప్టెంబరు 17: నల్లగొండ జిల్లా దేవరకొండలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఈ నెల 16న మద్యం మత్తులో బూషరాజు సంతోష్ అనే యువకుడు పులిజాల శంకర్‌పై కత్తితో దాడి చేసిన ఘటనలో సంతోష్‌ను అరెస్ట్ చేసి మంగళవారం కోర్టుకు రిమాండ్ పంపినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. గణేష్ శోభాయాత్రలో మద్యం మత్తులో ఉన్న సంతోష్ బొడ్రాయిబజార్‌కు చెందిన శంకర్‌తో గొడవపడ్డాడు. మత్తులో నిమ్మకాయలు కోసే కత్తితో సంతోష్ శంకర్‌ను గాయపరచగా, స్వల్పంగా గాయాలుకాగా దేవరకొండ ఆస్పత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. శంకర్ తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు సంతోష్‌ను కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.



గణేష్ నిమజ్జనోత్సవంలో అపశ్రుతి

● చెరువులో పడి యువకుడి మృతి ● యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో విషాదం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 17: అప్పటివరకు ఆనందోత్సాహాలతో సాగిన గణేష్ నిమజ్జనోత్సవంలో చిన్న ఏమరపాటు కారణంగా ఓ యువకుడు చెరువులో పడి మృత్యువాతపడ్డాడు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామం ముష్టోన్‌బాయి కాలనీకి చెందిన పబ్బతి మల్లయ్య కూలి పని చేస్తూ జీవనం సాగిస్తుండగా, కుమారుడు ప్రవీణ్, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహంకాగా, కుమారుడు ప్రవీణ్ (27) బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లో ఉంటున్న బావ వద్ద సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వినాయక చవితి పండుగ నిమిత్తం ఈ నెల 14వ తేదీన స్వగ్రామం చేరుకుని ఇంటివద్ద ఏర్పాటుచేసిన వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొన్నాడు. మంగళవారం ఉదయం గ్రామంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనోత్సవానికి తన స్నేహితులతో కలిసి ఊర చెరువుకు వెళ్లాడు. చెరువులో జారి పడి నీటిలో మునిగిపోయాడు. కొద్దిసేపటికి ప్రవీణ్ లేడనే విషయాన్ని గమనించిన స్నేహితులు చెరువులో గాలించారు. ఉపాధి పనుల్లో భాగంగా చెరువులో ఇటీవల తవ్విన పెద్ద గుంతలో ఇరుక్కోవడంతో 15నిమిషాల అనంతరం ఒడ్డుకు తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స చేసేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే మృతి చెందాడని గుర్తించారు. చెరువులో మునిగినా ఈత రాకపోవడంతో గుంతలో ఇరుక్కుపోవడంతో ఊపిరాడక మృతిచెందడంతో స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) ప్రవీణ్(ఫైల్)

దొంగకు దేహశుద్ధి చేసి...
పులిహోర తినిపించారు

● నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఘటన

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 17: ఓఆలయంలో చోరీకి యత్నించిన యువకుడిని పట్టుకున్న యువకులు దేహశుద్ధి చేసి స్తంభానికి కట్టేశారు.. అనంతరం ఆకలి వేస్తుందని చెప్పటంతో పులిహోర తినిపించి తండ్రికి అప్పజెప్పారు. సోమవారం రాత్రి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో ఈ సంఘటన జరిగింది. ఈ ఆసక్తికర సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావటంతో విషయం వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోగుల గణేష్ ఆంజనేయస్వామి ఆలయం తలుపులకు వేసిన తాళాన్ని పగులగొట్టే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో హుండీలోని డబ్బులను చోరీ చేసేందుకు యత్నించాడు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయకుడి మండపంలో మెలకువతోనే ఉన్న యువకులు అలికిడి విని వెళ్లి గణేష్‌ను పట్టుకుని స్తంభానికి కట్టేశారు. అర్ధరాత్రి సమయంలో ఇక్కడ ఏంచేస్తున్నావు, తాళం ఎందుకు పగులగొడుతున్నావని కొందరు యువకులు అతడికి దేహశుద్ధి చేశారు. దీంతో అతడి పెదవులు చిట్లాయి. తాను ఇంతకుముందే నాలుగు పర్యాయాలు చోరీ చేశానని, తనపై కేసులు ఉన్నాయని వివరించాడు. రెండు గంటల పాటు స్తంభానికి కట్టి ఉంచారు. తన వివరాలు చెప్పి, తనకు ఆకలిగా ఉందని చెప్పడంతో వినాయకుడి మండపంలోని పులిహోరను గణేష్‌కు తినిపించారు. తెల్లవారుజామున ఆ యువకుడిని తండ్రికి అప్పజెప్పారు.


ఆకలిగా ఉందని చెప్పడంతో పులిహోర తినిపిస్తున్న యువకుడు

శిశువు మృతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 17: వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ శిశువు మృతి చెందిందని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంపోడు తండాకు చెందిన బాసిపాకుల రేణుక, నాగరాజు ఆరోపించారు. మంగళవారం జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 15 ఆదివారం తన భార్య రేణుక పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో డెలివరి కోసం అడ్మిట్ అయిందని నాగరాజు అన్నారు. కాగా డ్యూటీ డాక్టర్ లేకపోవడం, నర్సుల నిర్లక్ష్యంతో నార్మల్ డెలివరీ అయినప్పటికి తమ శిశువు చనిపోయిందన్నారు. డ్యూటీలో ఉన్న డాక్టర్లు, నర్సులు కాన్పు సమయంలో తన భార్యను అసభ్యంగా దూషించి చేయి చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా డెలివరీ సమయంలో పాప నార్మల్‌గానే ఉందని, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటే సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి మూడు రోజుల క్రితమే పంపించామని ఆసుపత్రి ఇన్‌చార్జి తెలిపారు. డ్యూటీ డాక్టర్లు, నర్సుల తప్పు ఏమీ లేదన్నారు. గర్భిణీపై ఎవరు దాడి చేయలేదన్నారు.

భూమిని పట్టా చేయడం లేదని చంపేశాడు


● తండ్రిని హతమార్చిన తనయుడు ● తల్లీకుమారుల పరార్

కేతేపల్లి, సెప్టెంబరు 17: భూమిని తన పేరిట పట్టా చేయడంలేదనే ఆగ్రహంతో తనయుడు తండ్రిని హతమార్చాడు. మంగళవారం రాత్రి నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చెరుకుపల్లి గ్రామానికి చెందిన పిట్టల సైదులు(45) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తనకున్న మూడు ఎకరాలకు తోడు మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. సైదులుకు భార్య ప్రమీల, కుమారుడు నవీన్, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేయగా, కుమారుడు నవీన్ ఇంటి వద్దే ఉంటూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య వివాదాలు నెలకొన్నాయి. ఇదే సమయంలో తండ్రి సైదులు పేరిట ఉన్న మూడు ఎకరాల భూమిని తన పేరిట పట్టా చేయించమంటూ కుమారుడు నవీన్ తరచూ గొడవపడుతున్నాడు. ఈ విషయంలో సైదులు భార్య ప్రమీల సైతం కుమారుడు నవీన్‌కు మద్దతుగా ఉంటోంది. ఇదే విషయమై మంగళవారం మరోసారి ఇరువురి మధ్య గొడవ జరగడంతో ఆవేశంలో నవీన్.. తండ్రి సైదులు తలపై రోకలి బండతో మోదాడు. దీంతో సైదులు తలపగిలి రక్తపు మడుగులో పడి మృతిచెందాడు. ఇది గమనించిన తల్లీ కుమారులు ఇంటినుంచి పరారయ్యారు. ఇంట్లో జరిగిన గొడవను గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సైదులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని కేతేపల్లి ఎస్ఐ శివతేజ వివరించారు.

పట్టుబడిన గంజాయి విక్రేత

భువనగిరి టౌన్, సెప్టెంబర్ 17: జిల్లాకేంద్రం భువనగిరి పట్టణంలో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ డీటీఎఫ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈమేరకు తాపీ పనులు చేస్తూ స్థానిక జంఖానాగూడలో అద్దె ఇంట్లో నివాసముంటున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన జహీర్‌షేక్ వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన 100 గ్రాముల గంజాయి పట్టుబడింది. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని, గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్ సైదులు తెలిపారు.


పోలీసులు అదుపులో నిందితుడు



రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ఆలేరు రూరల్, సెప్టెంబరు 17: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈ ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజాపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన బింగి శ్రీను ప్రస్తుతం హైదరాబాద్ ఉప్పల్‌లో నివాసముంటున్నారు. మంగళవారం పని నిమిత్తం హైదరాబాద్ నుంచి ఆటోలో ఆలేరుకు వస్తుండగా ఆలేరు పెద్ద మసీద్ వద్దకు రాగానే వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఖాళీ ఇండేన్ గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీను తలకు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈవిషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజినికర్ తెలిపారు.


ధ్వంసమైన వాహనాలు, (ఇన్‌సెట్‌లో) గాయాలపాలైన ఆటో డ్రైవర్

పైన వాటర్ బాటిళ్లు.. లోపల లేగదూడలు

● వాటర్ బాటిల్ రవాణా పేరుతో లేగదూడల తరలింపు ● పట్టుకున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ● పోలీసులకు అప్పగింత.. కేసు నమోదు



హుజూర్‌నగర్, సెప్టెంబరు 17: మినీ వాహనంలో వాటర్ బాటిళ్ల పేరుతో లేగదూడలను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని మంగళవారం పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని జంగాలకాలనీలో కొనుగోలు చేసిన దూడలను అక్రమంగా తరలిస్తుండగా వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు, బీజేపీ నాయకులు పట్టుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో నెంబర్ ప్లేట్‌లేని మినీ వాహనంలో లేగదూడలు తరలిస్తున్నారు. అయితే వాహనంలో లోపల లేగదూడలు బయటకు కన్పించకుండా పైన వాటర్ బాటిళ్ల బస్తాలను వేశారు. వాహనం కోదాడ వైపు వెళుతుండగా.. కోదాడ రోడ్డు మూలమలుపు వద్ద ఉన్న భజరంగ్‌దళ్ కార్యకర్తలకు మూగజీవాల అరుపులు వినిపించడంతో వెంటనే వాహనాన్ని ఆపారు. వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో 10 లేగ దూడలు కన్పించాయి. భజరంగదళ్ కార్యకర్తలు వెంటనే బీజేపీ నాయకులకు సమాచారం అందించగా, వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ముత్తయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. లేగ దూడలను మునిసిపల్ కార్యాలయంలో కట్టివేశారు. కాగా ఎస్ఐ ముత్తయ్య, పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డిని పిలిపించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం లేగ దూడలను హైదరాబాద్ జియాగూడలోకి శ్రీసమృత కామధేను గోశాలకు తరలించారు. భజరంగదళ్, బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తల నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.


లేగదూడలు

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం



నేరేడుచర్లలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న అధికారులు

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని పలువురు అధికారులు అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేసి వందనం చేశారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

●. సూర్యాపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ జెండాను సూపరింటెండెంట్ లక్ష్మి ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ అంజయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, వెన్న వెంకట్‌రెడ్డి, వీరయ్య, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

● నేరేడుచర్ల మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఆవిష్కరించారు. తహసీల్దార్ సురిగి సైదులు, ప్రత్యేకాధికారి రాజేష్, మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మార్కెట్ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, ఎస్ఐ రవీందర్, ఏవో జావిద్ జాతీయ జెండాలను ఎగురవేశారు.

● ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందించాలని ఆర్డీవో శ్రీనివాసులు కోరారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు.

● కోదాడలోని రిటైర్డు ఉద్యోగుల కార్యాలయంలో జాతీయ జెండాను ఆ సంఘం నాయకుడు రావెళ్ల సీతారామయ్య ఆవిష్కరించారు.

● మునగాలలో జాతీయ జెండాలను తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్‌దీన్‌దయాల్, కొప్పుల జైపాల్‌రెడ్డి తదితరులు ఎగురవేశారు. .

● నూతన్‌కల్‌లో జాతీయ పతాకాలను తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, ఎస్ఐ మహేంద్రనాథ్, ఎంఈవో రాములు, ఏవో మురళి ఆవిష్కరించారు.

● నాగారంలో తహసీల్దారు వి.బ్రహ్మయ్య, ఎంపీడీవో ధార శ్రీనివాస్, ఏవో కృష్ణకాంత్, ఎస్ఐ ఎం.ఐలయ్య జాతీయ జెండాలను ఎగురవేశారు.

● హుజూర్‌నగర్ మునిసిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి ఎగురవేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి, కమిషనర్ యాకూబ్, కుంట ఉపేంద్ర, సైదులు, బాస్కర్, సతీష్, అశోక్, రంగారావు, రాజశేఖర్, వెంకన్న పాల్గొన్నారు.

● మేళ్లచెర్వు మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో జాతీయ జెండాను గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ఖాజాఅస్గర్‌అలీ ఆవిష్కరించారు.

● గరిడేపల్లిలో తహసీల్దార్ బండా కవిత, ఎస్ఐ చలిగంటి నరేష్, డాక్టర్ నరేష్, రాయినిగూడెం, సర్వారం పీఏసీఎస్ చైర్మన్లు జుట్టుకొండ సత్యనారాయణ, శంభిరెడ్డి, ఎంఈవో చత్రునాయక్ పాల్గొన్నారు

● మోతె, మద్దిరాల, తుంగతుర్తి, అర్వపల్లి, తిరుమలగిరి మండలాల్లో అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు. మోతెలో ప్రత్యేకాధికారి సీతారాంనాయక్ తహసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీవో ఆంజనేయులు, మద్దిరాలలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి నాగయ్య, తిరుమలగిరిలో చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, తహసీల్దార్ హరిప్రసాద్, తుంగతుర్తిలో తహసీల్దార్ దయానందం, ఎంపీడీవో శేషుకుమార్, అర్వపల్లిలో ఎంపీడీవో పవన్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ రఘువీర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.



మద్దిరాలలో జాతీయ జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన

సూర్యాపేట టౌన్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన కొనసాగుతుందని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, పబ్లిక్ క్లబ్ సెక్రెటరీ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం సూర్యాపేటలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, చకిలం రాజేశ్వర్‌రావు, కక్కిరేణి శ్రీనివాస్, చెంచల శ్రీనివాస్, గోదాల రంగారెడ్డి, కోతి గోపాల్‌రెడ్డి, చింతమల్ల రమేష్, నాగుల వాసు, ఆలేటి మాణిక్యం, పోలెబోయిన నర్సయ్యయాదవ్, రావుల రాంబాబు, గడ్డం వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.



డీసీసీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న వెంకన్నయాదవ్

డైవర్షన్ రోడ్డులో గుంతలు పూడ్చివేత



డైవర్షన్ రోడ్డు గుంతలను పూడ్చుతున్న సిబ్బంది

మేళ్లచెర్వు, సెప్టెంబరు 17: మేళ్లచెర్వు - చింతలపాలెం గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ పాస్ వద్ద డైవర్షన్ రోడ్డులో గుంతలను అధికారులు మంగళవారం పూడ్చారు. నత్తనడకన రైల్వే అండర్ పాస్ - వర్షం పడితే డైవర్షన్ రోడ్డులో ప్రయాణికులు అవస్థలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎక్స్‌కవేటర్, టిప్పర్ల సాయంలో డైవర్షన్ రోడ్డులో గుంతలను పూడ్చారు. దీంతో ఆ మార్గం నుంచి ప్రయాణించే వాహనదారులకు స్వల్ప ఊరట లభించింది.

పెరియార్ రామస్వామి చిత్రపటానికి నివాళి

నేరేడుచర్ల, సెప్టెంబరు 17: పెరియార్ రామస్వామి జయంతిని మంగళవారం నేరేడుచర్లలోని టెస్లా స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పెరియార్ రామస్వామి చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకుడు రాపోలు నవీన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టెస్లా స్కూల్ ప్రిన్సిపాల్ దాసరి సతీష్‌కుమార్, తక్కెళ్ల నాగార్జున, కర్రి సతీష్‌రెడ్డి, చిలకరాజు శ్రీను, కత్తి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి, సెప్టెంబరు 17: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాటమయ్య రక్షణ కవచం పథకాన్ని గౌడ సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ ఎస్ఐ గండమల్ల వెన్నెల, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్ గౌడ్‌లు అన్నారు. ఈ పథకం ద్వారా మోకు, ముస్తాద్‌తో ఎలా తాటి చెట్టు ఎక్కాలి? అనే అంశంపై మంగళవారం మండల కేంద్రంలో గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల సంఘం సభ్యులకు అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో గుండు రామాంజిగౌడ్, రాతికింది అంజయ్య, కొప్పు లక్ష్మీనారాయణ, కానుగు హుస్సేన్, రావుల కోటయ్య, కాసాని సైదులు, రావుల రాములయ్య, అంజయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: పట్టణంలో కల్లుగీత కార్మికులకు తాటి చెట్లు ఎక్కే మిషన్లపై ఎక్సైజ్ శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న మాట్లాడుతూ మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్ సహకారంతో గీత కార్మికుల భద్రత కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొంతగాని శ్రీనివాస్, వల్లబుదాసు కృష్ణ, చిరంజీవి, వెంకటేశ్వర్లు, తండు సాయిరామ్, బీక్షం, దుర్గయ్య, వెంకన్న పలువురు పాల్గొన్నారు.

కొనసాగిన గణేష్ శోభాయాత్రలు

తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 17: మండలంలోని తొండ, మామిడాల, వెలిశాల, తాటిపాముల, గుండెపురి, బండ్లపల్లి గ్రామాల్లో వినాయక నిమజ్జనం నిర్వహించారు. యువకులు బాణసంచా కాలుస్తూ, నృత్యాలు చేస్తూ గణనాథులను ఊరేగిస్తూ చెరువుల్లో నిమజ్జనం చేశారు.

మోతె: మండలంలోని నామవరం, మామిళ్లగూడెం, రాఘవాపురం, సిరికొండ తదితర గ్రామాల్లో గణేష్ శోభాయాత్రను నిర్వహించారు. గణనాథులను గ్రామాల్లో ఊరేగించి, అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి వరకు 301విగ్రహాలు నిమజ్జనం కాగా, మంగళవారం 48 విగ్రహాలు నిమజ్జనం అయినట్లు అధికారులు తెలిపారు. ఒక క్రేన్‌ను సద్దుల చెరువు కట్ట వద్ద అందుబాటులో ఉంచారు.

రూ.1.10లక్షలు పలికిన గణపతి లడ్డు

అర్వపల్లి, సెప్టెంబరు 17: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అర్వపల్లిలోని వినాయక మండపంలో నిర్వహించి లడ్డు వేలంలో తాడోజు ఆచార్య రూ.1.10లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రమేష్, పలిచర్ల ప్రభాకర్, మనోహర్, అశ్విన్, వినయ్, తదిరులు పాల్గొన్నారు.

నూతనకల్‌లో రూ.52వేలు

నూతనకల్: మండల కేంద్రంలోని చింతకిందిబజారులోని విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డు వేలంలో రూ.52వేలకు నెల్లుట్ల కృష్ణయ్య దక్కించుకున్నాడు. ఎలాంటి అవాంచనీయ ఎస్ఐ మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సెప్టెంబరు 17 ముమ్మాటికీ విద్రోహ దినమే

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 17: తెలంగాణ ప్రజలకు సెప్టెంబరు 17 ముమ్మాటికీ విద్రోహ దినమేనని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టేషన్ నుంచి విక్రమ్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారన్నారు. 10లక్షల ఎకరాలను పేదలకు పంచారన్నారు. . కార్యక్రమంలో కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, పేర్లనాగయ్య, గొడ్డలి నర్సయ్య పాల్గొన్నారు.

● తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కొంత మంది నాయకులు వక్రీకరించే కుట్రలు చేస్తున్నారని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

● ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధర్యంలో నిర్వహించిన ర్యాలీలో ప్రొఫెసర్ డాక్టర్ ఆరుట్ల జానకిరెడ్డి, పీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, నల్లెడ మాధవరెడ్డి, గుండాల సందీప్ పాల్గొన్నారు.

మోతె: తెలంగాణ ప్రజలు సెప్టెంబరు 17ను విద్రోహ దినంగానే చూడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రావిపహాడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు

నాగారం: మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, పోలెబోయిన కిరణ్ పాల్గొన్నారు.

కోదాడటౌన్: పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి వి.నరసింహారావు, అలుగుబెల్లి సత్యనారాయణరెడ్డి, వీరబాబు, షైనయ్య, పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నల్ల జెండాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, పెద్దింటి రంగారెడ్డి, కునుకుంట్ల సైదులు, మున్న అశోక్, ఉప్పలయ్య, సత్యం పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను సాధించాలి



నేరేడుచర్ల: పెంచికల్‌దిన్నె గ్రామంలో అమరుల స్థూపం ఎదుట నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నేరేడుచర్ల, సెప్టెంబరు 17: తెలంగాణ సాయుధ పోరు అమరుల ఆశయాలను సాధిద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొదమగుండ్ల నగేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో అమరుల స్థూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. ఈ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య నుంచి 4500 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, మర్రి నాగేశ్వరావు, అల్వాల శ్రీధర్, బొప్పని రాణమ్మ, పాలకూరి రాములమ్మ, నందమూరి బాబూరావు, సుంకరి వెంకటేశ్వరావు, రేబల్లి బిక్షం, ధూబాసి శ్రీను, పాల్గొన్నారు.

పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే

తుంగతుర్తి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికై నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా తుంగతుర్తి మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులను సన్మానించారు. అన్నారం గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్ద జెండా ఎగురవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాటి విజయమ్మ, శంకర్‌రెడ్డి, పల్లా సుదర్శన్, అంతయ్య పాల్గొన్నారు.

చిలుకూరు: తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించిన ఘనత కమ్యూనిస్టులదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించి మాట్లాడారు. ఈ సందర్భంగా సాయుధ పోరాట యోధులు దొడ్డా పద్మ, మంత్రిప్రగడ శకుంతలమ్మ, సాతులూరి నాగరత్నమ్మ, బాలెబోయిన లచ్చమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొండా కోటయ్య, దొడ్డా వెంకటయ్య, సాహెబ్‌అలీ, చిలువేరు ఆంజనేయులు, దొడ్డా నాగేశ్వరరావు, మండవ అచ్చయ్య పాల్గొన్నారు.

నూతన్‌కల్: తెలంగాణ సాయుధ పోరాట అమరుల ఆశయాల సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందాళ శంకర్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరుడు శేషయ్య స్థూపానికి పూలమాలల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అబ్బయ్య, రామ్మూర్తి, అమృతరెడ్డి, దయాకర్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: నిజాం సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. చింతపాలెం మండల కేంద్రంలో అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వట్టెపు సైదులు, సీపీఎం నాయకులు, సుందరమౌలేశ్వర్‌రెడ్డి, శ్రీను, పుల్లయ్య, వీరబాబు, మస్తాన్, భూలక్ష్మి పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం సరికాదు

కోదాడ టౌన్, సెప్టెంబరు 17: సచివాలయం ఎదుట తెలంగాణ తెలుగు తల్లి విగ్రహానికి కేటాయించిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ పట్టణ అధ్యక్షుడు షేక్ నయీం అన్నారు. మంగళవారం కోదాడలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కోదాడ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె నయీం, ప్రధాన కార్యదర్శి గట్ల కోటేశ్వరరావు, మెదర లలిత, పిట్టల భాగ్యమ్మ, మామిడి రామారావు, కర్ల సుందర్‌బాబు, చింతల నాగేశ్వరరావు, ఎస్‌కె ఆరీఫ్, నాగరాజు, సీమ శ్రీనివాసరావు, కె.నరసయ్య పాల్గొన్నారు.



కోదాడలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మద్దిరాల: సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం మద్దిరాల మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్, నాయకులు బెజ్జంకి శ్రీరాంరెడ్డి, కందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మారెల్లి యాకయ్య, మల్లు కపోతంరెడ్డి, వడ్డాణం మధుసూదన్, సూరినేని తిరుమలరావు, బద్దం అమృతారెడ్డి, రేసు వెంకన్న, పరీద్, గండయ్య, వెంకన్న, సూరాపు రాజు, శ్రవణ్‌కుమార్, ఉమామహేశ్వర్, నర్సయ్య, దామోదర్‌రెడ్డి, వీరమల్లు, మల్లేష్, రవి, నాగరాజు, గిరి పాల్గొన్నారు.

తిరుమలగిరి: సచివాలయం ఎదుట దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తిరుమలగిరిలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సతీష్, కందుకూరి బాబు, దయాయాదవ్, మూల వెంకట్‌రెడ్డి, ఎర్ర శ్రీను, సురేష్, మల్లేష్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టడం సమంజసం కాదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీ తయ్య అన్నారు.మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి నిర్వహించిన క్షీరాభిషేకం కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుండగాని రాములుగౌడ్, గుడిపాటి వీరయ్య, మల్లెపాక వెంకన్న, మల్యాల రాములు, కడారి దాసు, మట్టిపల్లి వెంకట్, దశరథ, యాకన్న,లింగయ్య పాల్గొన్నారు.

పంటలకు నష్టపరిహారం అందించాలి

మోతె, సెప్టెంబరు 17: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు అన్నారు. మంగళవారం మండలంలోని నర్సింహాపురం, రాయికుంట తండా, తుమ్మగూడెం, ఉర్లుగొండ గ్రామాల్లో రైతులతో కలిసి వరదలకు దెబ్బతిన్న పైర్లను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మద్ది మధుసూదన్‌రెడ్డి, దేవులానాయక్, నరేష్, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

మహారుద్రాభిషేకాన్ని విజయవంతం చేయాలి

హుజూర్‌నగర్, సెప్టెంబరు 17: మహారుద్రాభిషేకాన్ని విజయవంతం చేయాలని నాగసాధువుల భిక్ష బృందం లక్ష్మీనారాయణ, రాజారవర్మ, గజ్జి ప్రభాకర్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్ పాఠశాలలో మహారుద్రాభిషేకం నిర్వహించనున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. అక్టోబరు 27వ తేదీన ఎనిమిది అడుగుల మట్టి శివలింగాన్ని ప్రత్యేకంగా తయారుచేసి మహారుద్రాభిషేకం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుండా శ్రీనివాసరావు, నర్సింహారావు, అశోక్, శ్రీను, అంజయ్య, విజయ్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా చంద్రబాబు

నాగారం, సెప్టెంబరు 17: మండలంలోని పసునూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బి.చంద్రబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇమాంపేట మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. పసునూరు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కుంట రమేష్ గుండాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు.

ఆదిగురువు విశ్వకర్మ భగవానుడు



పూజల్లో పాల్గొన్న విశ్వకర్మ జయంత్యుత్సవ కమిటీ సభ్యులు

సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 17: విశ్వమానవాళికి ఆది గురువు విశ్వకర్మ భగవానుడని విశ్వకర్మ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఆకారపు పరిపూర్ణాచారి అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయం ఆవరణలో విశ్వకర్మ చిత్రపటానికి నిర్వహించిన పూజల్లో పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో మొట్టమొదటి ఇంజనీర్లు విశ్వకర్మలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నారయణదాస్ నర్సింహాచారి, దామోదరాచారి, కోశాధికారి గుండ శంకర్ పాల్గొన్నారు.

మండల పంచాయతీ అధికారిగా జగదీష్‌కుమార్

హుజూర్‌నగర్, సెప్టెంబరు 17: హుజూర్‌నగర్ మండల పంచాయతీ అధికారిగా జగదీష్‌కుమార్ మంగళవారం బదిలీపై వచ్చారు. చిలుకూరు నుంచి బదిలీపై హుజూర్‌నగర్‌కు వచ్చారు. జగదీష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.


ఘనంగా తెలంగాణ విమోచన దినం

తిరుమలగిరి, సెప్టెంబరు 17: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సామాజిక తెలంగాణ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తగట్టు మల్లయ్య, కడెం లింగయ్య, మూల సత్తయ్య, తన్నీరు రాంప్రభు, నీర్మాల యాకయ్య, అబ్రహం, మట్టిపెల్లి లక్ష్మి పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ' పక్షోత్సవాలు

నాగారం, సెప్టెంబరు 17: గ్రామాల్లో మంగళవారం నుంచి అక్టోబరు రెండో తేదీ(గాంధీ జయంతి) 'స్వచ్ఛ స్వభావం- స్వచ్ఛసంస్కారం' నినాదంతో గ్రామాల్లో పారిశుధ్యం - స్వచ్ఛదనం కార్యక్రమం చేపట్టనున్నామని ఎంపీడీవో ధార శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని పసునూరు గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో 'స్వచ్ఛతా హీ' ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు. విద్యార్థులో కలిసి పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. నాగారం బంగ్లా, నర్సింహులగూడెం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు గ్రామ సభలు నిర్వహించి ప్రజలతో 'స్వచ్ఛతా హీ' ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రవి, ఈసీ ముక్కంటి, ప్రత్యేక అధికారి ఏవో కృష్ణకాంత్ పంచాయతీ కార్యదర్శులు నజీర్, శోభన్‌బాబు, సతీష్, హెచ్‌ఎం శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకన్న, కళమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం



హుజూర్‌నగర్ రూరల్: పట్టణంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ధేనమకొండ రామరాజు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయి పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ముస్కుల చంద్రారెడ్డి, ఉమామహేశ్వరరావు, గోపి, శ్రీనివాస్, లక్ష్మణ్ కనకయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపీపీ కాలనీకి చెందిన తల్లిదండ్రు లను కోల్పోయి ఒంటరైన ఉదారి జ్యోత్స్నకు హుజూర్‌నగర్‌లోని యూపీఎస్ నెం.1 పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.10వేల ఆర్థికసాయం అందజే శారు. ఈ కార్యక్రమంలో అమరబోయిన శ్రీను, సింగం సత్యనారాయణ, కోలపూడి యోహాన్, ఎస్‌కే నాగుల్ మీరా, ఉదారి యాదగిరి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీ నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్ అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ సింగారపు అరుణ అన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.500లకే ఉచిత గ్యాస్ పత్రాలను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కె.రాంరెడ్డి, లింగయ్యయాదవ్, సీతారాంరెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని గోండ్రియాల గ్రామ శివారులోని పొలాల్లో 28 విద్యుత్ స్తంభాలు వేసి రెండు వారాలైనా నేటికి వైర్లు అమర్చలేదని రైతులు, కౌలు రైతులు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో 100ఎకరాల్లో వరి పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగయ్య, మురళి, రామారావు, తిరుమలరావు, శేషయ్య, బాపయ్య పాల్గొన్నారు.

చిలుకూరు: మండలంలోని రెడ్లకుంట మేజర్‌కు పడిన గండిని నాణ్యతతో పూడ్చాలని టీపీసీసీ ప్రతినిధి, సాగర్ ఎడమ కాల్వ మాజీ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి సూచించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి గండిపడిన ప్రాంతం వద్ద పనులను పరిశీలించి మాట్లాడారు. పనులు త్వరగా పూర్తయితే రైతులకు సకాలంలో నీరందించే అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, హనుమంతరావు, వంగవీటి రామారావు, బి.నాగేంద్రబాబు, బండ్ల కోటయ్య, యడవెల్లి పుల్లారావు పాల్గొన్నారు.

మునగాల: మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి జిల్లా గ్రంథాలయ శాఖ మాజీ కార్యదర్శి గంధం వెంకటాద్రి(72) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఆయన ఓ పత్రికా విలేకరిగా దశాబ్ద కాలం పాటు పని చేశారు. ఆయన మృతికి మండల నాయకులు కొప్పుల జైపాల్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, కందిబండ సత్యం, కాసర్ల కోటేశ్వరావు, ఉద్యోగ సంఘం నాయకులు సంతాపం తెలిపారు.

పాలకవీడు: మండలంలోని కోమటికుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గొర్రె శ్రీను కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయనకు జిల్లా కాంగ్రెస్ నాయకుడు మాలోతు మోతీలాల్ రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపాల్, సుబ్బుగౌడ్, శ్రీను, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: తుంగతుర్తి నియోజకవర్గంలో సాగునీటిని అందించడానికి జనగామ జిల్లా కొడకండ్ల గ్రామం శివారు బయ్యన్న వాగు నుంచి నీటిని ఎమ్మెల్యే మందుల సామేలు బుధవారం విడుదల చేస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు.